క్లుప్తంగా

డ్రోన్ కెమెరాతో మొక్కల రికార్డు



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం పంచాయతీలోని హరితహారంలో భాగంగా పల్లె ప్రకృతివనం, బృహత్‌పల్లె ప్రకృతివనంలో నాటిన మొక్కల సంఖ్యను, వాటి వివరాలను, పెరుగుదల, ప్రస్తుత తీరును డ్రోన్ కెమెరాతో రికార్డు చేశారు. పూర్తి సమాచారాన్ని కలెక్టర్‌కు అందజేస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ మేనేజర్ మల్లేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శంకర్, ఎంపీఓ ప్రసాద్, ఏపీఓ రమేశ్, సర్పంచ్ వసంత, టీఏ ప్రశాంత్, కార్యదర్శి సత్యనారాయణ, ఫీల్డ్‌అసిస్టెంట్ సతీష్ ఉన్నారు.

ఎల్ఓసీ అందజేత



మల్హర్: మండలంలోని నాచారం గ్రామానికి చెందిన సామల లత అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతుంది. దీంతో వైద్య ఖర్చుల కోసం బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్, పెద్దపల్లి జెడ్పీచైర్మన్ పుట్ట మధును కోరగా సీఎం సహాయ నిధి ద్వారా రూ.2.50 లక్షల ఎల్ఓసీని మంజూరు చేయించాడు. ఈ మేరకు మంథనిలో పుట్ట మధు ఇంటి వద్ద ఎల్ఓసీ పత్రాన్ని కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాఘవ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



మహాముత్తారం: పుట్టలింగమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 20న మంథనిలో నిర్వహించే మెగా జాబ్‌మేళాను మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కల్వచర్ల రాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఏడోవ తరగతి నుంచి పీజీ విద్యార్థుల వరకు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళ మండల కమిటీ అధ్యక్షురాలు లింగమల్ల రమాదేవి, యూత్ అధ్యక్షుడు జేపాల్‌నాయక్, సర్పంచ్‌లు దూలం మల్లయ్యగౌడ్, రత్నం బక్కయ్య, ముత్యాల రాజు,గంట వనజ కొండాల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి ఏరియాలో విధులకు గైర్హాజరు అవుతున్న కార్మికులకు నేడు (బుధవారం) కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఏరియా సింగరేణి అధికార ప్రతినిధి తుకారాం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2022 జనవరి 1నుంచి డిసెంబర్ 31వరకు ఏడాది కాలంలో 50మస్టర్ల కంటే తక్కువ చేసిన కార్మికులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏరియాలో విధులకు హాజరుకాని కార్మికులు, వారి కుటుంబ సభ్యులు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. కార్మికులు ఏమైనా అనారోగ్య కారణాలతో బాధపడినట్లయితే వాటికి సంబంధించిన పత్రాలను వెంట తీసుకురావాలన్నారు.

రేపు మహిళలకు చెస్ పోటీలు

భూపాలపల్లి అర్బన్: ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం పురస్కరించుకొని ఈ నెల 16వ తేదీన జిల్లా స్థాయిలో మహిళలకు చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారిని బుర్ర సునిత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన వారికి హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల మహిళలు 83285 77652 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఆర్థికసాయం

వెంకటాపురం(కె): మండలంలోని తానిపర్తి గ్రామానికి చెందిన శ్యామల రమేశ్ ఇల్లు ఇటీవల షార్టు సర్క్యూట్‌తో కాలిపోయింది. దీంతో బాధిత కుటుంబానికి ఆలుబాక జిల్లా పరిషత్ విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి మంగళవారం రూ.13,500 నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, జయరామ్, నర్సింహారావు, సంతోష్, ప్రసాద్, ఇమ్రాన్, మురళి, నాగలక్ష్మి, దేవేంద్ర, భీమా తదితరులు ఉన్నారు.

అంధత్వ నివారణే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



రేగొండలో కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

టేకుమట్ల(రేగొండ): రాష్ట్రంలో అంధత్వ నివారణే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం రేగొండ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కంటి వెలుగు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనిషి అవయావాల్లో అత్యంత ప్రధానమైనవి కళ్లు అన్నారు. కళ్లతో ప్రపంచాన్ని చూడగలమని, కావున అవి సరిగా పని చేస్తే ఏదైనా సాధించవచ్చని అన్నారు. రాష్ట్రంలో అంధ్వతం ఉండకూడదనే సంకల్పంతో సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. మే 31 వరకు కొనసాగే కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. రాష్ట్రంలోనే ఉన్నత ఆస్పత్రిగా రేగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మార్చిన ప్రతీ ఒక్కరికి అభినందనలు తెలిపారు. పల్లె దవాఖానలు సైతం అందుబాటులో ఉన్నాయని, కావున ప్రతి ఒక్కరూ ప్రభుత్వ వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఆస్పత్రిలో వైద్యసేవలను పర్యవేక్షించారు. రోగులకు అందించే వైద్యం, గర్భిణులకు పౌష్టికాహారం కిట్‌ల పంపిణీపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి హిమబిందు, స్థానిక సర్పంచ్ ఏడునూతుల నిశీధర్‌రెడ్డి, మోడెం ఉమేష్‌గౌడ్, మండల అధ్యక్షుడు అంకం రాజేందర్, టౌన్ అధ్యక్షుడు కొలెపాక భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

అద్దాల పంపిణీ



మహదేవపూర్: అద్దాలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

మహదేవపూర్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా అద్దాలు అవసరమని గుర్తించిన వారికి మొదటి విడతగా అద్దాలు పంపిణీ చేసినట్లు సర్పంచ్ శ్రీపతి బాపు తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలోని అర్హులైన వారిని గుర్తించి మంగళవారం అద్దాలు అందించడం జరిగిందని అన్నారు. దశల వారిగా అద్దాలు పంపిణీ చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

జోడో యాత్రతో గుణాత్మక మార్పు



చిట్యాల: మాట్లాడుతున్న సత్యనారాయణరావు

చిట్యాల: దేశ రాజకీయాలపై భారత్ జోడో యాత్ర గుణాత్మక మార్పు తీసుకొస్తుందని నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. చిట్యాల మండలంలోని శాంతినగర్ కైలాపూర్, చింతకుంటరామయ్యపల్లిలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర మంగళవారం కొనసాగింది. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించి సత్యనారాయణరావు మాట్లాడారు.. ఎనిమిదేళ్ల పాలనలో ప్రధాని మోదీ, సీఎం కేసీఆర్ పేద ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. దేశ సమగ్రతను కాపాడేది కాంగ్రెస్ పార్టీ అని, రాహుల్ గాంధీ దేశ ప్రజలకు జోడో యాత్రతో ఒక నమ్మకాన్ని కలిగించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

యాత్రను విజయవంతం చేయాలి

టేకుమట్ల: నియోజవర్గంలో ఈ నెల 21, 22న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టనున్న హాథ్ సే హాథ్ జోడో యాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నియంతపాలనను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అన్నారు. అలాగే గతంలో కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులపై కపట ప్రేమ



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

కాటారం: విద్యార్థులపై పెద్దపల్లి జెడ్పీచైర్మన్ పుట్ట మధు కపట ప్రేమ చూపిస్తున్నాడని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ పంతకాని సమ్మయ్య ఆరోపించారు. మండలంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇన్ని రోజులు గుర్తుకు రాని విద్యార్థుల ఆకలి కేవలం రెండు నెలల్లోనే భోజనం పెట్టాలని గుర్తుకు వచ్చిందా అన్నారు. ఎలక్షన్స్ వస్తున్నాయనే సేవ కార్యక్రమాలు మొదలు పెడుతున్నారని విమర్శించారు. హత్య ఆరోపణలు ఎదుర్కొంటున్న పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాస్ జైలులో ఉండగా ట్రస్ట్‌కు నిధులు ఎవరు విడుదల చేస్తున్నారో తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొడ్డు మల్లయ్య, మహిళ మండల అధ్యక్షురాలు జాడీ మహేశ్వరి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు దేవేందర్, పార్టీ ఉపాధ్యక్షుడు చీమల వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి కడరి విక్రమ్, సర్పంచ్ అజ్మీరా రఘురాంనాయక్, ఎంపీటీసీ రూప ఓంసింగ్, నాయకులు వీరమల్లు, మేడిపల్లి కిరణ్, గడవెని దేవేందర్, కొమురయ్య, వినయ్, సమ్మిరెడ్డి, బాసక్క తదితరులు పాల్గొన్నారు.

జాతరకు ముమ్మర ఏర్పాట్లు



ఆలయ ప్రాంగణాన్ని చదును చేస్తున్న డోజర్

పలిమెల: పలిమెల గ్రామ పంచాయతీ పరిధిలోని కామన్‌పల్లి గ్రామంలో నేడు, రేపు నిర్వహించే కోయజాతి ఆరాధ్య దైవమైన సమ్మక్క సాలరమ్మ జాతరకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతీ సంవత్సరం ఫిబ్రవరి నెలలో రెండు రోజుల పాటు జరిగే ఈ జాతరకు చుట్టు పక్కల గ్రామాలైన దమ్మూరు, బురుగ్గుడెం, నీలంపల్లి, ముకునూర్, పలిమెల, సర్వాయిపేట గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. ఈ మేరకు భక్తుల సౌకర్యార్థం సర్పంచ్ జవ్వాజి పుష్పలత ప్రత్యేక చొరవతో గుడి పరిసర ప్రాంతాన్ని చదును చేయించి, భక్తులకు కావాల్సిన ఇతర ఏర్పాట్లను చేస్తున్నారు. అలాగే పలిమెల గ్రామ పంచాయతీ పరిధిలోని కామన్‌పల్లిలో క్రీడా ప్రాంగణం కోసం అటవీ శాఖ అధికారులు సూచించిన స్థలంలో డోజర్‌తో చదును చేసే పనులు చురుగ్గా నిర్వహిస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్‌వైర్ చోరీ



పగిలి పోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

కాటారం: మండలంలోని గంగారం, దామెరకుంట గ్రామాల శివారులోని పంట పొలాలకు సమీపంలో గల మూడు ట్రాన్స్‌ఫార్మర్లను దుండుగులు పగలగొట్టి కాపర్ వైరును దొంగిలించిన సంఘటన సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, ట్రాన్స్‌కో ఏఈఈ మేఘనాథ్ తెలిపిన వివరాల ప్రకారం గంగారంలో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు, దామెరకుంట శివారులోని మల్లారం గల ఒక ట్రాన్స్‌ఫార్మర్‌కు అర్ధరాత్రి సమయంలో దుండగులు కర్రల సహాయంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ట్రాన్స్‌ఫార్మర్లను గద్దెలపై నుంచి కిందకు నెట్టి వాటిని పగలగొట్టి కాపర్‌వైర్ తీసుకెళ్లినట్లు తెలిపారు. మూడు ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి సుమారు 120 కిలోల కాపర్ వైర్ అపహరణకు గురైనట్లు విలువ సుమారు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఉంటుందని ఏఈఈ పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. కొంత కాలం క్రితం ఇదే తరహాలో మండలంలో భారీగా కాపర్‌వైర్ చోరీ జరగగా పోలీసులు దుండగులను పట్టుకొని కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కాపర్‌వైర్ దొంగతనంపై విచారణ జరుపుతున్నామని త్వరలోనే పట్టుకోవడానికి కృషి చేస్తామని, రైతులు అప్రమత్తంగా ఉండాలని సీఐ రంజిత్‌రావు, ఎస్సై శ్రీనివాస్ సూచించారు.

వెండితొడుగు బహూకరణ



ఆలయంలో అమర్చుతున్న వెండి తొడుగు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయం అనుబంధదేవాలయమైన శ్రీశుభానందదేవి అమ్మవారి ఆలయం తోరణానికి 53 కిలోల వెండి తొడుగును మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌రావు-వీణా దంపతులు బహూకరించారు. సుమారు విలువ రూ.40లక్షల వరకు ఉంటుందని ఆలయ వర్గాలు తెలిపారు.

ధ్వజ స్తంభానికి పూజలు



ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసేందుకు ధ్వజస్తంభాన్ని అడవి నుంచి ఆలయానికి తీసుకురాగా అర్చకులు కృష్ణమూర్తిశర్మ, ఫణీంద్రశర్మలు ప్రత్యేక పూజలు చేశారు. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. ఈఓ మహేష్ తదితరులు ఉన్నారు.

ఉత్సవ మూర్తుల శుభ్రం



ఉత్సవ మూర్తులను శుభ్రం చేస్తున్న అర్చకులు

కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి వారి ఆలయంలో మహా శివరాత్రి సందర్భంగా మంగళవారం ఉత్సవ మూర్తులకు, ఆభరణాలకు పులికాపు (శుభ్రం) చేశారు.

వెండి కిరీటం అందజేత



కిరీటాన్ని అలకరిస్తున్న దాతలు

మల్హర్: మండలంలోని ఎడ్ల గ్రామానికి చెందిన బుత్తల మౌనిక-రామకృష్ణ దంపతులు గ్రామంలోని సాయిబాబా ఆలయంలోని సాయి విగ్రహానికి మంగళవారం వెండి కిరీటం బహూకరించారు. 200 గ్రాములకిరీటాన్ని సాయిబాబాకు అలకరించారు.

బండా ప్రకాశ్‌ను కలిసిన జెడ్పీటీసీ



శుభాకాంక్షలు తెలుపుతున్న తిరుపతిరెడ్డి

టేకుమట్ల: రాజ్యసభ సభ్యుడు బండా ప్రకాశ్ శాసన సభ మండలి వైస్ చైర్మన్ పదవి చేపట్టిన సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట ఎంపీటీసీ ఆది రఘు, భాస్కర్ ఉన్నారు.

బ్యాటరీ ఆపరేటర్ ట్రై సైకిల్ పంపిణీ



బ్యాటరీ ఆపరేటర్ ట్రై సైకిల్‌ను పంపిణీ చేస్తున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

భూపాలపల్లి రూరల్: జిల్లాలోని మహాముత్తారం మండలం ములుగుపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడు జాడి రాజయ్యకు మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ భవేష్ మిశ్రా బ్యాటరీ ఆపరేటర్ ట్రైసైకిల్‌ను పంపిణీ చేశారు. దివ్యాంగుడు జాడి రాజయ్య కొన్ని రోజులుగా తన తండ్రి అంకయ్యతో కలిసి కలెక్టర్ కార్యాయంలో ప్రజావాణిలో బ్యాటరీ సైకిల్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. స్పందించిన కలెక్టర్ ప్రత్యేకంగా బ్యాటరీ సైకిల్ తెప్పించి రాజయ్యకు అందించారు. తమ బాధను చూచి చలించి బ్యాటరీ సైకిల్‌ను ఇప్పించిన కలెక్టర్‌కు దివ్యాంగుడు రాజయ్య, అతడి తండ్రి అంకయ్యలు కృతజ్ఞతలు తెలిపారు.

పైలేరియా నివారణ సర్వే



సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

మహదేవపూర్: మండలంలోని కాళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బొమ్మాపూర్ గ్రామంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీరామ్, ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ ఉమాదేవి ఆదేశాలతో వైద్య సిబ్బంది పైలేరియా నివారణ సర్వే సోమవారం రాత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని బొమ్మాపూర్ సర్పంచ్ పద్మరవీందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇంటంటి సర్వేలో వైద్య సిబ్బంది రాత్రి ఇంటింటికి తిరుగుతూ సర్వే చేపట్టారు. రక్త నమునాలు సేకరిస్తున్నట్లు కాళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టరు సుస్మిత, హెల్త్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ స్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్స్ అడప రాజరమణయ్య, సత్యనారాయణ, ఏఎన్‌ఎమ్‌లు సుశీల, తిరుపతమ్మ, ఆశవర్కర్లు స్వప్న, శైలజ, రాధిక, యశోద, గ్రామ పంచాయతీ సిబ్బంది సుద్దాల లలిత, పీక రాజమ్మ, బాపుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

హామీలు విస్మరించిన రాష్ట్ర ప్రభుత్వం



మాట్లాడుతున్న నిశీధర్‌రెడ్డి

టేకుమట్ల(రేగొండ): ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను విస్మరించిదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏడునూతుల నిశీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం రేగొండ మండలంలోని కోటంచ, భాగిర్తిపేట గ్రామాలలో మండల అధ్యక్షుడు దాసరి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని రైతులు ధరణి పోర్టల్ వల్ల తమ భూములు పట్టాలు కాక కొన్ని సంవత్సరాలుగా ఇబ్బందిపుడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఎంతో మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారని, కానీ ఉద్యోగాల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. ప్రభుత్వానికి వైస్‌షాపుల ఏర్పాటులో ఉన్న చిత్తశుద్ధి అధికార కార్యాలయాల ఏర్పాటులో లేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెన్నంపల్లి పాపన్న, ఉపాధ్యక్షుడు లింగంపల్లి ప్రసాద్‌రావు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు పొల్సాని తిరుపతిరావు, జిల్లా అధికార ప్రతినిధి ముడుపు అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండల కేంద్రంలోని గౌడ కులస్తుల ఆరాధ్యదైవమైన శ్రీరేణుకా ఎల్లమ్మ తల్లి దేవాలయ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడకులస్తులు కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలను నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉమేష్‌గౌడ్, చంద్రమౌళిగౌడ్ పాల్గొన్నారు.

నవజాత శిశువుల ఆరోగ్యంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ అవంతి

చిట్యాల: మండలంలోని నైన్‌పాక రైతువేదిక సెంటర్‌లో నవజాత శిశువుల ఆరోగ్యంపై సీడీపీఓ అవంతి అగంగన్‌వాడీ టీచర్లకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అవంతి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్ల నైపుణ్యాభివృద్ధి కోసం అభ్యాస విధానాలు గురించి వివరించారు. బలహీనమైన నవజాత శిశువులను గుర్తించడం ఎలా, అదనపు ఆహారం సరైన సమయానికి మొదలు పెట్టడం, అనారోగ్యంతో ఉన్న శిశువులకు ఆహారం ఎలా ఇవ్వాలి, అతి తీవ్రలోప పోషణను గుర్తించడం, నివారించడం అనే నాలుగు మాడ్యూల్స్‌ల గురించి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జయప్రద, రజిత పాల్గొన్నారు.

'చర్య తీసుకోవాలి'

టేకుమట్ల(రేగొండ): హైదరాబాద్‌లోని శ్రీచైతన్య కళాశాల యజామాన్యంపై చర్య తీసుకోవాలని సామాజిక రచయితల సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు కామిడి సతీష్‌రెడ్డి అన్నారు. మంగళవారం రేగొండ మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న నిమ్మల రమాదేవి అనే విద్యార్థిని ఆత్మహత్యకు యాజమాన్యమే ప్రధాన కారణమని ఆరోపించారు. ర్యాంకులే లక్ష్యంగా విద్యార్థులను మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురి చేస్తూ హింస్తున్నారని మండిపడ్డారు. మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి నష్టపరిహారం చెల్లిస్తూ మృతికి బాధ్యులైన కళాశాల యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన వెంట సామాజిక రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల రాజేశం ఉన్నారు.

నర్సరీ పరిశీలన



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి

పలిమెల: మండలంలోని నీలంపల్లిలోని నర్సరీ పనులను ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. నర్సరీ పనుల్లో వేగం పెంచాలని, హరితహారం కార్యక్రమం ప్రారంభమయ్యే నాటికి మొక్కలు ఎదిగేలా పనులు చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి పీటర్‌పాల్ ఉన్నారు.